

# మట్టిపక్షులు

జాన్సన్ చోరగుడి

**విజేత ఓటమి. గెలుపు ఓటములు సహజమే కదా! ఇందులో ప్రత్యేకంగా అనుకోవడానికి ఏముంది? గెలుపు ఓటముల కలగలుపే కదా జీవితం. కొందరికి వేగిరం పైకి రావడానికి విడిగా ఏమైనా ఏర్పాట్లు ఉంటాయా?**

ఏమో... అయినా, బతుకు సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరికీ సమాన పోరాటక్షేత్రమంటూ ఒకటి ఉండాలి కదా. ఉందా? అలా గనుక ఉంటే యుద్ధం-ధర్మయుద్ధమే. గెలిచినవాడు పోరాడి గెలిచినవాడే, ఓడినవాడు పోరాడలేక ఓడినవాడే. కాని అలా జరగడం లేదేమో, అసలు పోరాట క్షేత్రంలోనే అసమానతలు ఉన్నాయా? ఏమో, అలాగే అనిపిస్తుంది. ఎందుకంటే, యోధులు ఓడుతున్నారు. ఓడించవచ్చు, పోరు అన్నాక పోరులో మట్టి కరిపించవచ్చు. కానీ, యుద్ధం ధర్మయుద్ధం కావాలిగా. కాదనిపిస్తుంది. యుద్ధభూమిలోకి దిగిన ప్రతి ఒక్కరూ ప్రాణమో, కాళ్లూ చేతులో ఏదో ఒకటి పోగొట్టుకొని పోరు నుండి నిష్క్రమిస్తున్నారు. కానీ, ఏనాడూ యుద్ధభూమిలో పాదం కూడా మోపనివాడు విజేత అవుతున్నాడు. ఎరీనాలోకి దిగి పోరాటమే చేయనివాడు విజేత అవుతుంటే మరి యుద్ధభూమిలోని విగతజీవులు, క్షతగాత్రులు పోరాడుతున్నదెవరితో? వాళ్లు ఛస్తున్నదెవరి చేతిలో? అదే తెలియడంలేదు! యుద్ధం మాత్రం పంచరంగుల చిత్రంలా కొనసాగుతూనే ఉంది... కూపీ దొరకడం లేదుగానీ మొత్తానికి ఎక్కడో ఏదో మతలబు ఉంది. పట్టుకోవడానికి ప్రయత్నించాలి. దొరుకుతుందా?

అంజయ్య ఆలోచనలు ఎంతకీ ముందుకు సాగడంలేదు. క్యారంబోర్డు స్ట్రయిగర్ మాదిరిగా ఎంత వేగంగా ముందుకుపోతే, అంతే వేగంగా అవి తిరిగి వెనక్కి వస్తున్నాయి. ఇలా జరగడం ఒకటి రెండుసార్లు కాదు. అంజయ్య లెక్కపెట్టలేదు కానీ, లెక్కలేనన్నిసార్లు కొంతకాలంగా తరచూ ఇలాగే జరుగుతూ వుంది. నిజానికి అంజయ్య ప్రపంచం క్యారంబోర్డు అంత చిన్నదేంకాదు. పైగా విస్తృతమైంది కూడా. అయితే, అదే ఇప్పుడు అంజయ్యకు సమస్య అయింది. నలువైపులా విస్తరించుకున్న విశాలమైన తన భావప్రపంచంలో ఒక చిన్న బిందువు వద్ద సాలెగూట్లో చిక్కిన పురుగులా అతను కొట్టుమిట్టాడుతున్నాడు. నిజానికి అతని మథనం తనకు ఎదురైన సమస్యకు పరిష్కారం దొరక్కపోవడం గురించి కాదు, విస్తృతమైన జీవితానుభవంలో కొద్దిపాటి వివరం లోపించి లోకజ్ఞానం తెలుసుకోలేక తాను మోసపోవడం గురించి. మనిషి తన మీద తాను నమ్మకం పెంచుకోవడం ఆషామాషీ వ్యవహారం కాదు. కానీ, ఇప్పుడు అక్కడే తేడా వచ్చింది. అంజయ్య నమ్మకం వమ్మయింది. అతని ప్రపంచం ఒక్కసారిగా చిన్నదైపోయింది. అందుకే అతని ఆలోచనలు ఒక్కచోటే గిరికీలు కొడుతున్నాయి. ఫలానా అని తెలియడం లేదుగానీ, మొత్తానికి ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది.

అంజయ్య పుట్టిన ఏడాదికే తండ్రి చనిపోయాడు. తల్లి ఊళ్లో రైతుల ఇళ్లలో చాకిరీచేసి కొడుకును పెంచింది. ఉన్న ఊళ్లో హైస్కూల్ దాకా చదివిన అంజయ్య పై చదువులకు పట్నం పోయాడు. హాస్టల్లో సీటు కూడా తానే సంపాదించుకున్నాడు. కాలేజీలో మాత్రం లెక్కలు, సైన్స్ చదవాలని ఆశపడితే ఎకనామిక్స్, హిస్టరీ గ్రూప్‌లో సీటు దొరికింది. ఇంజ

నీరింగ్ చదవాలని కోరిక. కానీ అవలేదు. బియ్యే ఫస్టు క్లాసులో పాసైన అంజయ్య సీటు కావాలని ఉత్తరం రాస్తే వచ్చి జాయిన్ కమ్మని బి.ఇడి కాలేజీ నుండి జాబు అందింది. అంజయ్య మేనమామ రాఘవులు ఊళ్లో వందెకరాల షావుకారు శేషయ్య దగ్గర పాలేరు. ఆయన వట్టి షావుకారే కాదు, వరుసగా నాల్గు టర్మ్‌ల జిల్లా పరిషత్ ఛైర్మన్‌కు స్వయాన పిల్లనిచ్చిన మామ. బి.ఇడి పాసైన మేనల్లుణ్ణి రాఘవులు వెంటబెట్టుకుని ఓ పొద్దుటపూట షావుకారు దగ్గరకు తీసుకెళ్లి, 'ఈడు నా సెల్లి కొడుకు. తండ్రి లేని పిల్లోడు. చదువుకున్నాడు. తవరే సాయం చేయా,'లని తలకున్న కండువా తీసి చేత్తో పట్టుకుని నుంచున్నాడు. షావుకారు తల ఊపాడు. నాలుగు రోజులకు షావుకారు శేషయ్య జిల్లా పరిషత్ ఛైర్మన్ అయిన తన అల్లుడికి రాసిన సిఫార్సు ఉత్తరం పట్టుకొచ్చాడు రాఘవులు. మర్నాడు ఉత్తరం తీసుకుని బందరు వెళ్లిన అంజయ్య, ఆ రాత్రి ఆఖరు బస్సుకు అపాయింట్‌మెంట్ ఆర్డరు పుచ్చుకుని ఇంటికి చేరాడు. జిల్లా సరిహద్దుల్లో బస్సుదిగి నాలుగుమైళ్లు నడిచి వెళ్లేంత దూరమున్న ఓ గ్రామ పంచాయితీలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా అంజయ్యకు పోస్టింగ్ దొరి కింది. అంజయ్యకు ఇప్పటికీ గుర్తే, తాను ఉద్యోగంలో చేరిన రోజునే అమెరికా వాళ్లు చంద్రుని మీద కాలు మోపారు. ఆరోజు న్యూస్‌పేపర్ కూడా చాలా రోజుల పాటు దాచి ఉంచాడు అంజయ్య గుర్తుగా! కొన్నాళ్లకు అదే సమితిలో పక్క ఊళ్లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న విజయమ్మతో అంజయ్యకు పెళ్లయింది. ఇంజనీర్ కావాలనుకున్న అంజయ్య ఆలోచనలు ఆ అడివూళ్లో అలా అయ్యవారుగా తెల్లవారాయి.

కాలేజీలో అంజయ్య చురుకైన విద్యార్థి. చదువు, ఆటలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, నాటకాలు, పాటలు - ఇలా అతనికి ప్రవేశంలేని రంగం ఉండేది కాదు. విద్యార్థి ఉద్యమాల్లో ఎప్పుడూ ముందుండే వాడు. మార్క్స్, అంబేద్కర్, చలం, ఉన్నవ, శ్రీశ్రీ, తిలక్ రచనలు ఇష్టంగా చదివేవాడు. అదొక ఎల్లలు లేని ప్రపంచం. కానీ, ఉద్యోగం చేస్తున్న ఊళ్లో అంజయ్య ప్రపంచం చాలా చిన్నదైపోయింది. కృష్ణా-ఖమ్మం-నల్గొండ జిల్లా సరిహద్దుల్లో ఉన్న ఆ గ్రామాల్లో తరచూ భూ పోరాటాలు జరుగుతూ ఉండేవి. అంజయ్యకు ఆ పోరాటాలు చేసేవారి పట్ల సానుభూతి ఉండేది. వారికి తనుకున్నంతలోనే ఏదో ఒక సాయం అందించేవాడు. సమితి టీచర్స్ యూనియన్‌కు అంజయ్య కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. పిల్లలు ముగ్గురూ కాస్త పెద్దయ్యాక, జిల్లా యూనియన్ బాధ్యతలు కూడా పెరిగాక, జిల్లా కేంద్రం దగ్గరల్లోని హైస్కూల్‌కు బి.ఇడి అసిస్టెంట్స్‌గా ఇద్దరికీ బదిలీ అయింది. విజయమ్మ పొందికైన ఇల్లాలు. అంజయ్య పిల్లల చదువుపట్ల ఎక్కువ శ్రద్ధ కనబరచేవాడు. వాళ్లు కూడా మెరికల్లాంటి పిల్లలు. తండ్రి మాదిరిగానే చదువుల్లో దూసుకుపోయేవారు. పిల్లల చదువుల విషయంలో అంజయ్య ఎక్కడా రాజీ పడదలుచుకోలేదు. వాళ్లు కూడా ఆ విషయంలో తండ్రికి ఎక్కడా అసహనం కలిగించలేదు. మొదటి వాడు ఇంజనీరింగ్ మూడో ఏడులోకి ప్రవేశించగానే రెండవవాడు ఇంజనీరింగ్‌లో జాయిన్ అయ్యాడు. సహ ఉపాధ్యాయుల్లో ఇప్పుడు అంజయ్య అంటే ఒక ప్రత్యేకమైన గౌరవం. అప్పు చేశాడా, ఏమి చేశాడన్నది కాదు విషయం. పిల్లల్ని బాగా చదివించాడు. వాళ్లు కూడా ప్రయోజకులయ్యారు. ఆఖరిది కూతురు. ఎంసెట్ కోచింగ్ తీసుకుంటోంది. వచ్చే ఏడు మూడవ అడ్మిషన్!

*

చదువు ఎక్కడున్న మనిషిని ఎక్కడకు తీసుకు వెళుతుందో అంజయ్యకు తెలుసు. అలాగే అందీ అంద నట్లుగా ఉండే అవకాశాలు ఒక జీవితకాలం పాటు ఒక తరానికి ఎలా చేరువ కాకుండా దూరమైపోతాయో కూడా అంజయ్యకు అనుభవమే. దుర్గాప్రసాద్, అంజయ్య హైస్కూల్స్ క్లాస్‌మేట్స్. ఎసెస్సెల్సీ వరకూ ఇద్దరూ కలిసి చదివారు. చదువంటే ఆసక్తే కానీ, అతను అంజయ్య మాదిరిగా చదవలేకపోయేవాడు. ప్రతి సబ్జెక్టుకు అంజయ్య వద్ద సందేహాలు తీర్చుకునే వాడు. తరచూ అంజయ్య నోట్సులు అడిగి తీసుకుని ఇంటికి పట్టుకెళ్లి రాసుకునేవాడు. అవకాశం అందివచ్చి ఇంజ నీరింగ్‌లో చేరాడు. తర్వాత ఇరిగేషన్ డిపార్టు మెంట్‌లో ఉద్యోగం దొరికింది. పండుగల సెలవులకు అంజయ్య ఊరు వెళ్లినప్పుడు తానూ వచ్చేవాడు. కలిసి మాట్లాడు కునేవాళ్లు. కొన్నాళ్ల తర్వాత రావడం తగ్గించాడు. తర్వాత ఊళ్లో పొలాలు అమ్మేసుకున్నారని, హైదరాబాద్‌లో స్థిరపడ్డారని అన్నారు. అంజయ్య తల్లి తరచూ, ''అయ్యా, ఊళ్లో ఇంత చెక్క పొలం కొనుక్కోరా, నల్లగెడ్డ ఉంటే ఉండే ఇలువ మరింక దేనికీ రాదురా,'' అనేది.

''నీకు తెలవదులేవే అమ్మా, పొలం కొనుక్కునే టంత డబ్బు మనదగ్గర ఎక్కడుంది? ఏదో దొరికిన

చోటల్లా లోన్లుపెట్టి తెచ్చి పిల్లల్ని చదివించుకుంటున్నాంగానీ మనదగ్గర ఉండా?'' అనేవాడు అంజయ్య.

వేసవి సెలవులకి ఓ నెలరోజులుపైగా అంజయ్య కుటుంబంతో సహా వచ్చి స్వగ్రామంలో ఉండేవాడు. పిల్లలు ఊళ్లో తమ ఈడు పిల్లలతో కలిసిపోయి తాటి తోపుల్లోనూ, చెరువుగట్లు, కాలువగట్ల మీద ఆడుకునే వారు. అంజయ్య దాన్ని ఇష్టపడేవాడు. ఎప్పుడైనా భార్య పిల్లల్ని బయటకు వెళ్లవద్దంటే ఆమెను వారించి వాళ్లను ఊళ్లో స్వేచ్ఛగా తిరగనివ్వు అనేవాడు. తాను ఎక్కడ ఉంటే అక్కడి వాతావరణంలో ఇమిడిపోవడం అంజయ్యకు ఇష్టం. రాత్రి భోజనాలు అయ్యాక పొద్దు పోయేదాక పల్లె మధ్యలో ఉన్న మాలక్ష్మి మాను చుట్టూ ఉన్న చప్టా మీద చొక్కాలు లేకుండా తుండు భుజాన వేసుకుని కూర్చుని, అదీ ఇదని లేకుండా అన్ని సంగతులూ మాట్లాడుకునేవారు. అంజయ్యకు మామ వరస అయిన ముసలోళ్లు అంజయ్య తండ్రి యలమంద గురించి, తాత దావీదు గురించి హాస్యకాలు జోడించి మరీ కథలు కథలుగా చెప్పేవారు. తనకు ఊహ తెలిసిననాటికే తండ్రి తెలియని అంజయ్యకు ఆ మాటలు వింటుంటే పండువెన్నెల్లో వెండి ఇసుక తిన్నెల మీద విహరిస్తున్నట్లుగా ఉండేది. వాళ్లు చెప్పే పాత కాలం నాటి పరాచికాలకు ఒక్కోసారి పొలమారే టంత నవ్వుతో తడిసి ముద్ద అయ్యేవాడు అంజయ్య. మధ్య మధ్యలో నవ్వడం ఆపి తుండుతో కళ్లనీళ్లు తుడుచుకునేవాడు. ఆకలికి కూడా హాస్యాన్ని జోడించడం ఈ మనుషులకే సాధ్యమేమో అనిపించేది. ఆకలి బయట ఉండి అదేమిటో తెలియకుండా దానిగురించి మాట్లాడే వాళ్లకు అది ఒక గంభీరమైన వస్తువు అవుతుందేమో గాని, జీవిక అంతా దాని చుట్టూతానే తిరిగే వారికి అన్ని భావాలకు అదే కేంద్రబిందువు అవుతుంది. అందులో హాస్యం, విషాదం అన్నీ కలగలిసే వుంటాయి. వారి జీవితాల్లో వాటిని విడివిడిగా చూడ్డం కుదరదు.

అంజయ్య దగ్గరికి వచ్చేసరికి సాలు తప్పింది గానీ, అంజయ్య కుటుంబానిది షావుకారు శేషయ్య కుటుంబంతో రెండు తరాల సేవానుబంధం. షావుకారు శేషయ్య అన్న రామకోటయ్య దగ్గర అంజయ్య తండ్రి యలమంద నౌకరు చేసేవాడు. అంజయ్య తాత దావీదు రామకోటయ్య తండ్రి పెద రామకోటయ్య దగ్గర నౌకరుగా ఉండేవాడు. వయసు మీరింది, కాడి కింది ఎడ్లు తన మాట వినడంలేదు అనుకొన్నాక దావీదు కొడుకు యలమందను వేరే దొడ్డి మార్చకుండా తన దొర కొడుకు దగ్గరే నౌకరీకి ఉంచాడు. పెద్ద పండక్కి ముందు పొలం మీద కళ్లంలో కాపలా పడుకున్న యలమందను పాము కరిచింది. దొర పట్నం పోకుండా ఇంటి పట్టున ఉండుంటే వైద్యం చేయించేవోడు, అతడు బతికేవోడు అనుకున్నారు ఊళ్లో కొందరు. ఆడికి భూమ్మీద నూకలు చెల్లిపోతే ఎవుళ్లేం చేస్తారు అనుకున్నారు మరికొందరు. ఏదేమైతేనేం అంజయ్య అలా తండ్రి లేని పిల్లవాడుగా మిగిలాడు. కానీ, రెండు తరాల కుటుంబ వారసత్వం నుండి అంజయ్య బయటపడ్డాడు. ఊళ్లోకి వచ్చినప్పుడు ఎప్పుడైనా క్లాస్‌మేట్ దుర్గాప్రసాద్ గుర్తుకొస్తే ఎక్కడో ఓ క్షణం కెలికివేసినట్టు ఉండేది అంజయ్యకు. అది గుండె లోనా, మనసులోనా ఎక్కడో తెలీదు!

''మీ తాత దావీదుగోడు జవానంటి మనిషి. కావిడిబద్దలా ఒంపుదీరి ఉండేవోడు. ఆడు గోచీ బిగించి ఈలేసి నిమ్మకాయ పైకిసిరేస్తే, భంచత్ రెండు తాళ్ల ఎత్తు తగ్గితే ఒట్టు. ఆడు రెండు చేతుల్తో రెండు కర్రలు పట్టుకుని కర్రసాము చేస్తే ఊళ్లో ఆడామగా ఊపిరి బిగబట్టి చూసేవోళ్లు. మీ తాత సాలే నీకొచ్చిందిరా మనవడా, నిన్నెప్పుడు చూసినా ఆడే గుర్తుకొస్తాడు.'' పులుకడిగిన ముత్యాల్లా కపటం తెలియని ఆప్యాయపు మాటలవి. ''అంతా బాగానే ఉంది గాని, ఇంత నల్లగెడ్డ కొనుక్కోరా అబ్బాయి, అదుండా దారి వేరు,'' పెదనాన్న వరసైన ఓ పెద్దోడి సలహా.

''ఎక్కడ పెద్దయ్యా, పిల్లల్ని చదివించుకుంటున్నాగా','' అంటూ తేల్చేసేవాడు అంజయ్య. ప్రతి ఏడాది వేసవి సెలవులు ఊళ్లో గడిపి ఊరి జ్ఞాపకాలను మూట గట్టుకుని వెళ్లేవాడు అంజయ్య.

*

అంజయ్య కూతురికి ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ అడ్మిషన్ తంతు అంతా అరగంటలో పూర్తి అయింది. అంజయ్యకు తన అడ్మిషన్ రోజులు గుర్తుకొచ్చాయి. తనది పి.యు.సి. ఆఖరి బ్యాచ్. తాను లెక్కలు, సైన్స్ గ్రూప్ కావాలని అడిగాడు. తన మార్కులకు ఆ గ్రూప్ రావాలి. కానీ, రెండు వారాలు వెయిటింగ్‌లో ఉంచి, చివరికి వేరే గ్రూప్ అయితే సీటు ఉంది, దీన్లో లేవు అని తేల్చి చెప్పేశారు. తన మార్కులు చూసి అప్పటికే తనకు హాస్టల్‌లో వార్డెన్ సీటు రిజర్వు చేసి పెట్టాడు.

భోజనం, వసతి ఉచితం. కొద్ది మొత్తం స్కాలర్‌షిప్ కూడా వచ్చేది. కానీ, తనకంటే తన పిల్లలు ఎంత అదృష్ట వంతులు అనుకున్నాడు అంజయ్య. కొద్దిరోజుల్లోనే కూతుర్ని కాలేజీలో చేర్చడానికి భార్యను కూడా తీసు కుని బయల్దేరి వెళ్లాడు. కాలేజీ ఛైర్మన్ గదిలోకి వెళ్లిన అంజయ్య ఛైర్మన్ కుర్చీలో కూర్చున్న యువకుని చూసి ఓ క్షణం తటపటాయించాడు. టేబిల్ మీద గోల్డ్ కలర్‌లో మెరుస్తున్న అక్షరాల్లో 'హేమంత్' నేమ్ బోర్డు ఉంది. కానీ, కుర్చీలో ఉన్నది దుర్గాప్రసాద్! కాదు పాతి కేళ్లనాటి దుర్గాప్రసాద్. తడబాటును సర్దుకుని తన పని పూర్తి చేసుకుని బయటకొచ్చే ముందు ప్రశ్నార్థకంగా అడిగాడు అంజయ్య.

"దుర్గాప్రసాద్...?" ఆ యువకుడు ఎదురుగా ఉన్న కంప్యూటర్ కీబోర్డ్ పైన వేళ్లను కదుపుతూనే చురుగ్గా అంజయ్యవైపు చిరునవ్వుతో చూశాడు.

"య్యా... డాడీ..." అంటూ మీకు తెలుసా అన్నట్టు చూశాడు.

అంజయ్య అతనికి ఏ భాషలో ఏమని జవాబు ఇచ్చాడో తెలియదు. సన్నగా చెమట పట్టిన దేహంతో ఛైర్మన్ ఏ.సి గది నుండి బయటకొచ్చాడు. కూతురు హాస్టల్ అడ్మిషన్, రూమ్‌కు సామాను తీసుకువెళ్లడం, ఆ మధ్యాహ్నం హాస్టల్లో ముగ్గురూ లంచ్ చేయడం మామూలుగా జరిగిపోయాయి. అంజయ్య అనాసక్తిగా ఉన్న సందర్భాల్లో అతని భార్య విజయమ్మ చొరవ తీసుకుని అన్ని పన్లు పూర్తిచేసింది. ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. కూతుర్ని దూరంగా ఒంటరిగా వదిలి వెళ్తున్నందుకు అంజయ్య 'మూడీ' అయ్యాడను కున్న విజయమ్మ రైలెక్కి కూర్చుని కళ్లు మూసుకుంది.

*

బిటెక్ పూర్తి కాగానే ప్లేస్‌మెంట్ చూసుకుంటా నని పెద్దకొడుకు హైదరాబాద్ వెళ్లాడు. తన ప్రయ త్నాలు ఎలా ఉన్నాయో, తన రూమ్మేట్స్ ప్రయత్నాలు ఎలా ఉన్నాయో అక్కణ్ణించి, రాత్రి పదకొండు గంటల తర్వాత ఇంటికి ఫోన్ చేసి చెప్పేవాడు. రెండు మూడు కంపెనీలకు ఆ వారంలో వాకిన్ ఇంటర్వ్యూలు ఉన్నా యని, ఏదో ఒకటి ఫైనలైజ్ అవుతుందని చెప్పేవాడు. తర్వాత వారం ఫోన్ చేసినప్పుడు మరీ లో పే ఆఫర్ చేస్తున్నారని, బి.టెక్ చేసి మరీ టూ త్రీ థౌజండ్స్‌కు ఎలా పనిచేస్తాం డాడీ అనేవాడు. అంజయ్యకు నిజమే కదా అనిపించేది. 'ట్రై చెయ్యి నాన్నా,' అనేవాడు. కొడుక్కి ధైర్యం చెబుతూ నిరుత్సాహపడనక్కర్లేదని ప్రోత్సహించే వాడు. కూతురుని ఇంజనీరింగ్‌లో చేర్చి తిరిగి వచ్చిన అంజయ్య, విజయమ్మలకు ఇంట్లోకి అడుగుపెట్టగానే పెద్ద కొడుకు రాసిన ఉత్తరం కనిపించింది. ఎప్పుడూ ఫోన్ చేసే కొడుకు ఉత్తరం రాశాడు. ఉత్తరం చదివిన అంజయ్య మౌనంగా ఉండిపోయాడు. ముందురోజు నుండీ భర్త ధోరణి అర్థంకాని విజయమ్మ ఉత్తరం తీసి చదవడం ప్రారంభించింది.

డియర్ మమ్మీ, డాడీ

ఫోన్లో కంటే లెటర్ అయితే అన్ని విషయాలు మీకు తెలియజేయవచ్చని రాస్తున్నాను. ప్లేస్‌మెంట్ కోసం నేను చేస్తున్న ప్రయత్నాలు ఏవీ సక్సెస్ కాలేదు. ఎప్పటికి అవుతాయో కూడా తెలియడం లేదు. ఇక్కడ వేజెస్ చాలా పూర్‌గా ఉన్నాయి. స్టార్టింగ్ టూ త్రీ థౌజండ్స్ ఆఫర్ చేస్తున్నారు. నాకు అస్సలు ఇష్టం లేదు. ఇంతలో ఫార్చ్యునేట్‌గా ఓ ఆఫర్ వచ్చింది. నిజానికిది మా రూమ్మేట్ వాళ్ల మామయ్య తెచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో హైవే వర్క్స్ మొత్తం మన స్టేట్‌కు చెందిన బాలాజీ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి వచ్చాయట. ఇప్పటికే ఇక్కణ్ణుంచి మా బ్యాచ్‌మేట్స్ చాలామంది వెళ్లి అక్కడ జాయిన్ అయ్యారు. స్టార్టింగ్ ఫైవ్ థౌజండ్స్ ఇస్తారట. మంచి ఆఫర్. నేనూ వెళ్తాను. ఈ నెలాఖరుకు తమ్ముడికి మిడ్ సెమిస్టర్ ఎగ్జామ్స్ అయిపోతాయి. చెల్లికి హోమ్‌సిక్ హాలిడేస్ ఇస్తారు కదా! నేనూ వస్తాను. వచ్చి వాళ్లతో నాల్రోజులు ఉండి ఛత్తీస్‌గఢ్ బయల్దేరతాను. డాడీ మీకొక సర్‌ప్రైజ్! బాలాజీ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఛైర్మన్ వై.వి. రావ్‌గారిది మన నానమ్మ వాళ్ల ఊరేనట. మమ్మీ ఎలా ఉన్నావ్? ఉంటాను. బైబై.

...దీపక్

ఉత్తరం వచ్చిన దగ్గర్నుండి ఉద్యోగం కోసం ఛత్తీస్‌గఢ్ వెళ్తున్న కొడుకు, ఇంజనీరింగ్ చదువుతున్న పిల్లల రాకకోసం విజయమ్మ ఎదురుచూస్తూ ఉంది. వాళ్లకోసం ఏమి చెయ్యాలా అని ఆమె ఒకటే ఆరాట పడిపోతున్నది.

అంజయ్యకు కూతురు అడ్మిషన్ సమయంలో గూడు కట్టుకున్న నిర్లిప్తత, కొడుకు ఉత్తరం చూశాక నెమ్మదిగా కరిగిపోయింది. అప్పటివరకు బిగుతుగా పట్టిన చిక్కుముడి విప్పుకోలేదుగానీ, మెత్తబడింది. ఇక దాన్ని కొంచెం కొంచెం ఓపిగ్గా ఏదో ఒకవైపు నుండి విప్పడం మొదలుపెడితే చిక్కువీడ్డం పెద్ద కష్టం కాదు. అంజయ్య ఇప్పుడు ఆ పనిలో ఉన్నాడు.

అంజయ్య తాత దావీదు నౌకరీ చేసింది పెద రామకోటయ్య దగ్గర. ఆయన అప్పుడు ఊరి ప్రెసిడెంట్. అంజయ్య తండ్రి యలమంద నౌకరీ చేసింది చిన రామకోటయ్య దగ్గర. ఆయన సమితి ప్రెసిడెంట్. ఆయన బావ జిల్లా పరిషత్ ఛైర్మన్. అంజయ్య జిల్లా టీచర్స్ యూనియన్ సెక్రటరీ అయ్యేసరికి చిన రామకోటయ్య కొడుకు రామమోహనరావు ఎమ్మెల్యేగా గెలిచి ఒక టర్మ్ సహాయమంత్రిగా చేశాడు. అతని బావ జిల్లా పరిషత్ ఛైర్మన్ కొడుకు, వై.వి. రావ్ వరుసగా మూడోసారి ఎం.పి. ఇప్పుడు తన కొడుకు దీపక్, బి.టెక్ వాళ్ల కంపెనీలోనే ట్రెయినీ ఇంజనీర్‌గా ఛత్తీస్‌గడ్‌లో సర్వీస్ ప్రారంభించబోతున్నాడు.

తనతో కలిసి చదివిన దుర్గాప్రసాద్ కొడుకుతో సొంతంగా ఇంజనీరింగ్ కాలేజీ పెట్టించాడు. దాన్లో కూతురుకి సీటు సంపాదించి అంజయ్య తానొక టెన్సింగ్ నార్కేననుకొని తన భుజం తానే తట్టుకున్నాడు. తాతలనాటి నుండి తన కుటుంబానికి మూడుతరాల దొరల వద్ద తన కొడుకు ఉపాధి వెతుక్కుని వాడొక కొలంబస్‌ని అనుకుంటున్నాడు. ప్రతివారూ ఏదో ఒక మంచి మాటే అన్నారు. కానీ, ఇప్పుడు సోషల్ స్టడీస్ టీచర్ అంజయ్యకే అర్థంకావడం లేదు తన గొప్పతన మేమిటో? పి.యు.సి.లో సైన్స్, లెక్కలు గ్రూప్ సీటు ఆనాడు తనకి అందని మానిపండు అయింది. కానీ, అవే కాలేజీల్లో అవే గ్రూపులు చదవడానికి ఇప్పుడు పిల్లలు లేరు! తనకి ఇంజనీరింగ్ ఒక నిజం కాని కల. కానీ తన పిల్లలకు అది ఎదురొచ్చిన ఏరువాక అయింది. అంజయ్య సమీకరణాలు ఇప్పుడు కొంచెం స్పష్టమయ్యాయి. ఒకప్పుడు మనం కావాలని ఆశపడ్డా అందనిది, అపురూపం అనుకొన్నది ఇప్పుడు మనకు కూడా తేలిగ్గా దొరుకుతుందీ అంటే, అది మరెవరికీ అక్కర్లేంది అయిపోయిందన్నమాట. అలాగే ఎందుకను కోవాలి? డిమాండ్‌తోపాటు సప్లయి కూడా పెరిగిందను కోవచ్చుగా? నిజానికి అలాగే అనుకోవాలి. కానీ, ఇక్కడ సప్లయి పెరుగుతూ ఉంటే, దాని వాల్యూ తగ్గుతూ వుంది!

*

నిడదవోలు టౌన్. రాత్రి పదకొండు దాటింది.

పెళ్లి అయిపోయి చాలాసేపయిందేమో, ఫంక్షన్ హాలు నుండి వచ్చినవాళ్లు ఒక్కొక్కళ్లూ వెళ్లిపోతున్నారు.

''ఒరేయ్ తమ్ముడూ అంజీ,'' అంటూ బలమైన చెయ్యి భుజం మీద పడ్డంతో పూర్తిగా వెనక్కి తిరగక ముందే, అంజయ్యను పొదివి పట్టుకున్నాడు వచ్చిన కొత్త మనిషి. ఊహించని పిలుపు స్పర్శకు ఉక్కిరి బిక్కిరై, స్థిమితపడి తన ముఖం ఎవరి గుండెలను ఆను కుని ఉందో చూసుకుని, తనను బలంగా చుట్టుకున్న చేతుల జ్ఞాపకాలలో నుండి ఆ స్పర్శానుభూతిని ఆర్తిగా తడుముకుంటూ- ''డానీ అన్నా!'' పిలిచాడు అంజయ్య. డేనియల్ - అంజయ్య బాల్య జ్ఞాపకాలలో అతడు ఒక స్పార్టకస్! గుంటూరు ఏ.సి కాలేజీలో బి.ఏ లిటరేచర్ చదువుతూ, ఆ కాలేజీ ప్రిన్సిపల్ కూతురును ప్రేమిం చాడు. ఆమె అతన్ని చూడకుండా ఉండలేకపోయేదట. విషయం తెలిసిన ఆమె బాబాయిలు ఓ రాత్రి రైల్వే ఫ్లాట్‌ఫాం మీద ఒంటరిగా ఉన్నవాణ్ణి రౌడీలతో కొట్టిం చారట. చనిపోయాడనుకుని వదలి వెళ్లినవాడు ఎలాగో ఊరు చేరుకున్నాట్ట. ప్రిన్సిపల్ భార్య మలయాళీ. మలబారులో పోలీస్ కమాండెంట్‌గా పనిచేస్తున్న ఆమె తమ్ముడికిచ్చి వెంటనే కూతురు పెళ్లి చేయించిందట. ఆ విషయం తెలిసిన డేనియల్ చదువు మానేసి ఆర్మీలో చేరాడట. ఇవీ డేనియల్ గురించి అంజయ్య విన్న విషయాలు. చైనా, పాకిస్తాన్ రెండు యుద్ధాలలో బోర్డర్‌లో పనిచేసి వచ్చినవాడు డేనియల్. అప్పట్లో సెలవులకు డేనియల్ ఊళ్లో కొస్తే, ఊరంతా అబ్బురం గా చెప్పుకొనేవాళ్లు. అంజయ్య ఆరవ తరగతి చదువు తున్నప్పుడు ఒకరోజు బడికి వెళుతుంటే ఊళ్లో బస్ దిగి ట్రంకుపెట్టె, బెడ్డింగ్ పట్టుకుని ఆరడుగుల మనిషి మిలిటరీ యూనిఫారంలో ఎదురుగా రావడం చూశాడు. భయపడి కరణంగారి ఇంటి సందులో పుమ్మెత్తల పొదల చాటున నక్కి కూర్చుని, అతను సందు దాటి వెళ్లాక లాగు తడుపుకున్నంత పనై బయటి కొచ్చాడు. కొన్నాళ్లకు తెలిసింది ఆ మిలిటరీ మనిషి తన ఇంటికి నాలుగు వీధులవతల ఇంటివాడని. ఆ వరసలో చివరిగా ఉండేది ఓ ఒంటినిట్టాడి ఇల్లు. దాన వతల పంటకాల్వ పొలాలు కొంచెం పెడగా గూడెపోళ్ల శ్మశానాలు ఉండేవి. ఒకరోజు డేనియల్‌ను దగ్గరగా చూస్తానని అంజయ్య అమ్మతో అంటే, నవ్వి సరేనని తీసుకెళ్లింది. అమ్మ కొంగు పట్టుకుని వెళ్లిన అంజయ్య ఇంటిముందు వేపచెట్టు కింద నులకమంచంలో కూర్చుని ఏదో పుస్తకం చదువుకొంటున్న డేనియల్‌ను చూసి అమ్మ చాటున నక్కాడు. అమ్మ వచ్చిన పని చెబితే నవ్వి అంజయ్యను దొరకబుచ్చుకుని ఒళ్లో కూర్చోబెట్టుకున్నాడు డేనియల్.

''ఎట్టా ఉన్నావక్కా? అమ్మ చెప్పింది బావ పోయాడని''

"ఊఁ వచ్చే పెద్ద పండక్కి రెండెల్లి మూడో ఏడు వస్తది."

"అవునట, వీడేంటీ బడికెళ్తన్నాడా?"

"ఆరు సదువుతున్నాడు."

డేనియల్ దగ్గర సిగరెట్ వాసన అంజయ్యకు నచ్చలేదు. నెమ్మదిగా లేచి వచ్చి డేనియల్ తల్లి ఆలీసమ్మ ఇచ్చిన పీట మీద కూర్చున్న అమ్మను చుట్టుకుని నుంచున్నాడు.

రాత్రి వీధి దీపాల కింద చిన్నా, పెద్దా అంతా డేనియల్ చుట్టూ చేరేవాళ్లు. తాను చెబుతున్న యుద్ధం సంగతులు వాళ్లు వింటుంటే, వాళ్లు చెప్పే ఊరి సంగతులు డేనియల్ వినేవాడు. అంజయ్యకు టీచర్ పోస్టింగ్ వచ్చిన తర్వాత కూడా ఒకటిరెండు సార్లు ఊళ్లొకొచ్చి వెళ్లాడు. డేనియల్ మిలిటరీలో ఉండగానే తల్లి ఆలీసమ్మ చనిపోయింది. ఆమె చనిపోయాక మాత్రం ఒకసారి వచ్చి అమ్మ సమాధి చూసుకుని ఓ రాత్రి ఆ ఇంటిలో ఉండి, తెల్లవారేసరికి ఊరెళ్లి పోయాడన్నారు. ఇన్నాళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడిలా. ఫంక్షన్ హాల్ ఆవరణలో చివరిగా విడిగా ఉన్న ఫైబర్ కుర్చీల్లో కూర్చున్నారు ఇద్దరూ.

"మళ్లీ ఎన్నాళ్లకి?" జ్ఞాపకాల నుండి బయట కొస్తూ అన్నాడు అంజయ్య.

"అవును నీ గురించిన సంగతులు వింటూనే ఉంటాను. ఏమిటి తిరుగుప్రయాణం గుడివాడకేనా?"

ఆశ్చర్యాన్ని అదిమిపట్టి, "అవును ఓ గంటలో ఒంగోలు ప్యాసింజర్ ఉంది. స్టేషన్‌కు వెళ్లాలి."

"పద పోదాం," డేనియల్ బయటికొచ్చాడు.

ఇద్దరూ నడుస్తున్నారు. ఊరు నిద్దరపోయింది. నిడదవోలు రైల్వేస్టేషన్ ముందు రిక్షాలవాళ్లు వాటిలోనే ముసుగుదన్ని పడుకున్నారు. నాలుగురకాల సిగరెట్ పెట్టెలు పగిలిన పాత అద్దాలపెట్టెలో పెట్టుకుని, టీ అమ్ముతూ టూ-ఇన్-వన్ వ్యాపారం చేస్తున్న బడ్డీ వద్ద ఆగి టీ చేయమన్నాడు డేనియల్. ఆకు వేసి మరిగించిన తాజా టీ తాగి, రెండు సిగరెట్ పెట్టెలు, అగ్గిపెట్టె తీసుకుని, డబ్బులిచ్చి, "పద," అన్నాడు. అంజయ్య అడుగులు కలుపుతున్నాడు. నవంబర్ అర్ధరాత్రి ప్లాట్‌ఫాం మీద అలికిడి లేదు. టికెట్ తీసుకుంటూ, 'మరి నీకో,' అన్నట్టు చూశాడు అంజయ్య.

"నాది పాస్, నువ్ తీసుకో," అన్నాడు డేనియల్.

బండికి ఇంకా గంటన్నర టైముంది. ఇద్దరూ మౌనంగా ప్లాట్‌ఫారం చివరికి నడుస్తున్నారు. లైటు స్తంభం కింద కూర్చున్న ఓ పిచ్చిది తన ఒళ్లో ఉన్న కుక్క మెళ్లో పూసలదండ కడుతూ ఉంది. అదేమో కట్టించుకోనని మారాం చేస్తా ఉంది. వాళ్లను దాటుకుని ఇద్దరూ చివరిగా ఉన్న సిమెంట్ బెంచీ మీద కూర్చున్నారు. రిలాక్స్‌డ్‌గా వెనక్కి వాలి సిగరెట్ అంటించుకుంటూ,

"ఊఁ చెప్పు జీవితమెలా ఉంది?" డేనియల్ అడిగాడు.

ఆ ప్రశ్నకు ఓ క్షణం అంజయ్య మైండ్ బ్లాంక్ అయింది. వెంటనే తేరుకుని, "నడుస్తా ఉంది," అన్నాడు.

"అంతేనా ఈమధ్య కొన్నాళ్లు హాస్పిటల్‌లో ఉన్నావట?"

అంజయ్యకు అర్థమైంది- తన గురించి అన్నీ తెలియంది ఏమీలేదని. ఒక్షణం ఆగి, కాస్త కూడదీసుకుని, "అదా, జస్ట్ ప్రికాషనరీ. ఏదో కొంచెం చెస్ట్ పెయిన్ అన్పిస్తే... డాక్టర్స్ స్ట్రెయిన్ అవొద్దు అన్చెప్పి పంపించేశారు."

చేతిలో సిగరెట్ పీక దూరంగా విసిరేస్తూ, "చూడు అంజయ్యా! నువ్వు హాస్పిటల్‌లో చేరకపోయుంటే నేను ఆశ్చర్యపోయుండేవాణ్ణి. ఈ ఒక్క పాయింట్ మీద, ఏదీ నువ్వు గుండెజబ్బుల హాస్పిటల్‌లో చేరావన్న ఒక్క పాయింట్ మీద నీ ఫ్యామ్లీ లైఫ్ ప్రొఫైల్ నేను చెప్పగలను. నువ్వైనా, నేనైనా కాలేజీలో చదువుతున్న రోజుల్లో కూడా అన్నిరకాల కూలిపన్లూ చేసినవాళ్లమే. స్ట్రెయిన్ కావడానికి మన శరీరాలు చిన్నప్పట్నుంచీ అలవాటుపడ్డవే. ఇప్పుడు మనకు కొత్తేముంది! బహుశా నీ సమస్య స్ట్రెస్ అయి ఉండాలి. నీ మైండ్‌మీద ఒత్తిడి పెరిగింది. లేదా నువ్ పెంచుకున్నావ్."

అంజయ్య మాట్లాడలేదు. డేనియల్ సిగరెట్ అంటించుకుంటూ, "నువ్వు నాకు ఏమీ చెప్పలేదు. అయినా నేను చెబుతున్నాను విను. నేను చెబుతున్నది నిజం కాకపోతే నన్ను ఆపమను. ఆపుతాను. నువ్వు చెప్పింది వింటాను. చదువయిపోయిన ఏడాదికే నీకు గవర్నమెంట్ ఉద్యోగం దొరకటం నీకున్న అర్హతను బట్టి వచ్చిందేకానీ, అది ఏ ఒక్కరి ఆయాచిత ధర్మం కాదు. నీతో చదువుకున్నవాళ్లు, నీలాగా చదవలేనివాళ్లు కూడా కొద్దిమంది నిన్ను మించిన స్థితిలో ఈనాడు ఉండి ఉండవచ్చు. జీవితంలో సెటిల్ కావడమనేది మన టేకాఫ్ ఎక్కడ మొదలయింది అనేదాన్ని బట్టి వుంటుంది. మనవి సున్నా వద్ద మొదలైన జీవితాలు.

అవి ముప్పై అయిదు నలభై పాయింట్ల దగ్గరకు వచ్చేసరికి మన యాక్టివ్ లైఫ్ అయిపోతుంది. కొందరి టేకాఫ్ మనం ఆగిన ముప్పై నలభైల దగ్గర మొదలవుతుంది. సహజంగానే వాళ్లు ఎనభై తొంభైల వరకు వెళతారు. ఇంకా పైకి లాగే క్లిఫ్ హాంగర్స్ ఏమైనా దొరికితే మరో యాభై పాయింట్లకు చేరతారు. వాళ్లతో మనల్ని మనం పోల్చుకోవటం మనం చేసే మొదటి తప్పు. అయితే, వాళ్లలో ఉన్న చెడును వదిలి, మంచిని సవ్య దృక్పథంతో చూడలేకపోవడం మన రెండవ తప్పు. అయినా, తెలిసి చేస్తున్నామో, తెలియక చేస్తున్నామో గానీ, మన ప్రాధాన్యతలను ఎంచుకోవడం వద్దే మనం తడబడ్డాం. ముందు వెనకలయ్యాం. సగం దూరం వచ్చేశాక నాలుక్కరుచుకుని ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే ఏముంది? దిక్కుతోచని స్థితి. ఈలోగా ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడం సంగతి పక్కనబెట్టి, మార్గంలో దొరికే ఫలాలను అందినకాడికి పంచుకోవడానికి అలవాటుపడ్డాం. ఇప్పుడు దారి తప్పామంటే ఒప్పుకునేవాడు ఒక్కడూ లేడు. అందరూ ఆ మాట అన్నవాడి మీద నుండి నడిచి వెళ్లేవాళ్లే. అయినా, ఇదీ కొందరికి లాభసాటి వ్యాపారంలాగే ఉంది. అసలు దారిలో వెళితే వచ్చే ఫలాల కంటే అడ్డదారిలో దొరికే వాటికి శ్రమ తక్కువ కదా! ఇప్పుడు దేశమంతా ముమ్మరంగా నడుస్తున్నది ఆ రేసే! అందరూ ఆ బిజీలోనే ఉన్నారు,'' నిర్లిప్తంగా అన్నాడు డేనియల్.

''కొంతకాలంగా నేను ఆలోచించకపోలేదు, అయినా నువ్వు చెప్పేదేమిటో కొంచెం వివరంగా చెప్పరాదూ''

''నీ రైలుకు టైమయింది, సిగ్నల్ కూడా ఇచ్చాడు.''

''ఫర్లేదు. రేపాదివారమే కదా. తర్వాత బండికెళ్తాను. చెప్పు.''

ఇద్దరూ లేచి పట్టాలు దాటి, అవతలికి వెళ్లి వచ్చారు. "ఏమిటీ, ఎక్కడున్నా నువ్వు," అని అంజయ్య అడిగితే, సర్వీస్ నుండి డిశ్చార్జ్ అయ్యాక ఏవో కొన్ని ఉద్యోగాలు చేసి చివరికి తాడేపల్లిగూడెం ఫుడ్ కార్పొరేషన్ గోడౌన్ వద్ద సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్‌గా పనిచేస్తున్నానని అన్నాడు. ఓ కూతురున్న విధవరాల్ని చేరదీశాననీ, ఆ పిల్లను బి.ఇడి చదివించి పెళ్లి చేశాననీ అన్నాడు. ప్లాట్‌ఫాం ఈసారి పూర్తిగా నిర్మానుష్యం అయిపోయింది. మళ్లీ నాలుగు గంటలకు ఏదో ఎక్స్‌ప్రెస్ వస్తుందని చెప్పాడు టీ అమ్మినవాడు. పిచ్చిది, దండ కట్టించుకున్న కుక్క ఒకే బొంత కింద నిద్దర పోతున్నారు. డేనియల్ తన దగ్గరున్న బ్యాగ్ జిప్ తీసి అందులోంచి నాచురంగు శాలువా తీసి అంజయ్యకిచ్చాడు కప్పుకోమని. అంజయ్య, 'మరి నీకో' అంటే, 'నాకిది వుందిలే,' అని చీకట్లో ఎర్రగా కాలుతున్న సిగరెట్ చూపించి కాసేపు మౌనంగా ఉండిపోయాడు. భుజాల నిండుగా శాలువా కప్పుకుని, చేతులు ముడుచుకుని కూర్చున్న అంజయ్యకు క్రమంగా బయట వాతావరణం తెలియడంలేదు.

కొంతసేపటికి క్రమంగా వాతావరణం అంతా నిశ్శబ్దం ఆవరించింది. ''అంజయ్యా! వేదాంతం చెబుతున్నాను అనుకోకు. ఈ భూమి, ఆకాశం, వెలుతురు, చీకటి, నీరు, నిప్పు, గాలి అందరివి. వీటి నుండి నువ్వు ఏమీ సృష్టించుకుంటావు అనేది నీ నైపుణ్యానికి సంబంధించిన విషయం. కేవలం అంతిమ ఫలాల పంపకం దగ్గర నా వాటాకు ఇన్ని రావాలి అంటే నీకు ఇవ్వడానికి ఎవడూ ఒప్పుకోడు. నీకంటే ముందు నుండీ క్యూలో కనిపెడుతున్నవాళ్లు చాలామంది ఉంటారు. దేశానికి స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసి, పోరాటాలు చేసిన వేలాది కుటుంబాలు స్వాతంత్ర్యం వచ్చాక సహజంగానే తొలి పంక్తిలో అధికార విందుకు సిద్ధమయ్యాయి. వాళ్ల క్లెయిమ్‌ను నువ్వూ, నేనూ కాదనగలమా? మా తాత ముత్తయ్య బందరు కలెక్టర్ బంగ్లాలో బట్లర్‌గా ఉండేవాడు. డచ్ దొర అప్పుడు కలెక్టర్. మా తాతకు వాళ్లు మతమిచ్చి మాథ్యూస్‌ని చేశారట. బంగ్లా కాంపౌండ్ లోనే గుర్రపుశాలలతోపాటు వీళ్లకూ క్వార్టర్స్ ఉండేవట. మా నాన్నకు బడిఈడు వచ్చేనాటికి బందరులో మిషనరీలు బోర్డింగ్ స్కూలు తెరిచారట. దానిలో అన్ని కులాలవాళ్లూ చదువుకునేందుకు లేదు. కొన్ని కులాల వారికి మాత్రమే ప్రవేశం. అంజయ్యా, పిల్లలు ఇప్పటికీ మన తెలుగు వాచకాలలో మన నాయకులు గురించి పాఠాలు చదువుతుంటారు. '...ఆయన లండన్ వెళ్లి బారిస్టర్ చదివెను,' అని. దొరల పరిపాలన కాలంలో కూడా దొరల బంగ్లాలలో బట్లర్‌గా పనిచేసినవాళ్ల పిల్లలు ఎవరూ లండన్ వెళ్లి బారిస్టరు చదవలేదు. మా నాన్న చివరికి ఎనిమిది క్లాసులు చదివి మిషన్ ఆస్పత్రిలో కాంపౌండర్ అయ్యాడు. తెల్లవాడు మాత్రం ఎవరిని వెన్నంటి ఉన్నాడు? ఎందుకు చెబుతున్నానంటే, ప్రస్థానాన్ని అర్థం చేసుకోవాలి. కలెక్టర్ వంట గదిలోకి ప్రవేశమే మా తాతకు గొప్ప. అదీ మన స్పీడు. అయితే, స్వాతంత్ర్యం వచ్చాక ముందుగా పంపకాలకు

కూర్చున్నవాడు కూడా మనల్ని మర్చిపోలేదు. విందు మందిరం బయట ఆకలి కేకలు ఉండకూడదు కదా! అందుకని కొంచెం కొంచెం మనకూ పంచారు. ప్రతి శాఖలోనూ మన వాటా మనకు ఉండేది. ఉంది కదా అని మనం నిశ్శబ్దమయ్యాం. ఎందుకని? మనకీ పెడుతున్నారు కదా! వాళ్లతోపాటు మనమూ తింటున్నాము. ఇంకేం కావాలి అనుకున్నాం. ఇప్పుడు ప్రస్థానం చివరి అంకానికి చేరుకుంది. ప్రభుత్వ శాఖల బోర్డులు పక్కకు తప్పుకుంటున్నాయి. వాటి స్థానంలోకి తొలి పంక్తిలో విందుకు కూర్చున్న కుటుంబాల పేర్లతో కొత్త బోర్డులు పైకి ఎక్కుతున్నాయి. దానికి ప్రైవేటీకరణ అని లాంఛనంగా పేరు పెట్టారు. ఇప్పుడు నీ ఆకలికో, నీ అనారోగ్యానికో, నీ నిరుద్యోగానికో సంబంధిత ప్రభుత్వ శాఖలకు పూచీ లేదు. ఎందుకంటే, ప్రభుత్వం పాత్ర అయిపోయింది.''

''ప్రభుత్వం అంటే ఏమిటి?'' - అంజయ్య.

''ఈ ప్రశ్న అడిగి నా శ్రమ తగ్గించావు. ప్రభుత్వమంటే ప్రజలు. అంటే నువ్వూ, నేనూ కాదు. బ్రిటీష్ జెండా ఈ గడ్డపై కిందికి దిగి, దాని స్థానంలో మన జాతీయపతాక ఎగురవేసే సమయానికి వాళ్ల చేతిలో నుండి అధికారాన్ని అంది పుచ్చుకోవడానికి అన్నివిధాలా సిద్ధంగా ఉన్న 'ప్రజలు.' ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా బలోపేతమైన సమూహమది. ప్రభుత్వంలో ఇక వారి పాత్ర పూర్తి అయింది. కానీ, అదే జాతీయ జెండా కింద అంతే సిద్ధబాటుతో ఉన్న కొత్త సమూహం ఇప్పుడు బాధ్యతలు తీసుకోవాలి. రాజ్యపాలన ఒక నిరంతర ప్రక్రియ. కొందరు వ్యక్తులు కొన్ని సర్వీసులతో సహా దీని నుండి నిష్క్రమించవచ్చు. అంత మాత్రాన ఏమీ ఆగిపోదు. అప్పటికి ఉండే జన బాహుళ్యానికి అవసరమైన సేవలు అందించే సమూహాలు పగ్గాలు చేపట్టి ఈ ప్రక్రియను కొనసాగిస్తాయి. కానీ, అందుకు సిద్ధబాటు కావాలి. అది ఎటువంటిది అంటే- 1947కు ముందులాంటిది కావచ్చు...''

ఏదో సూపర్ ఫాస్ట్ ట్రెయిన్ ఆ రాత్రి నిశ్శబ్దాన్ని భీకరంగా చీల్చుకుంటూ వెళ్లింది. పిచ్చిదాని బొంత కింద పడుకున్న కుక్క లేచి మొరుగుతూ రైలు వెంట పడింది.

డేనియల్ సిగరెట్ కాల్చుకుంటున్నాడు. టైం ఎంతయిందో తెలీదు. వెన్నెల మంచులో కరిగి నేలపై వెండి రజను కురుస్తోంది. రైలుపట్టాలకవతల పొన్నాయి పూలచెట్టు నుండి తెరలు తెరలుగా వస్తున్న వాసన సాంద్రత పెరుగుతూ ఉంది.

''అయితే గాంధీ....'' అంజయ్య ఎందుకో ఆగిపోయాడు.

''ఎందుకు ఆగావు? గాంధీజీలో మనకు కావాల్సిన మంచిని తీసుకోవడానికి మనకు అభ్యంతరం ఎందుకు ఉండాలి? మనవాళ్లు చాలామంది అంటుంటారు. నీకూ అనుభవం ఉండి ఉండాలి. అబ్బాయి టెన్త్ తప్పి ఖాళీగా ఉన్నాడు. ఏదైనా జాబ్ చూడయ్యా, ఏదైనా చేస్తానంటున్నాడు అబ్బాయి అంటుంటారు. నిజానికి టెన్త్ తప్పి ఖాళీగా ఉన్నవాడు 'ఖాళీ'గా ఎందుకుంటాడు? టీనేజ్ పైత్యాలు అన్నింటికీ గ్రామాల్లో వీళ్లే మహారాజ పోషకులు. మనం ఎక్కడికో వెళ్లి సంపాదించుకుంటున్న వాళ్ల గురించి మాట్లాడుకుంటాం. కానీ, పూట గడవని పరిస్థితిలో ఇతర ప్రాంతాల నుండి చాప కింద నీరులా మన ఊళ్లలో మన ఆర్థికవ్యవస్థలోకి ప్రవేశించి, విస్తరించి, స్థిరపడ్డవాళ్ల గురించిన స్పృహ మనకు ఉండదు. తోపుడుబళ్ల మీద పళ్లు, కూరగాయలు అమ్మడంతో జీవికను ప్రారంభించి కేవలం మూడు దశాబ్దాలలో కోస్తాంధ్రలో వార్డు మెంబర్లు, కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు, బిజినెస్ సిండికేట్లతో క్రియాత్మక పాత్ర పోషిస్తున్నవారు ఎందరు లేరు? వారు చేస్తున్నది ఉద్యోగమా? ఉపాధా? వారికి అది ఎవరిచ్చారు? అట్టడుగు నుండి ఎకానమీలో వాళ్లు తమ పునాదులు పటిష్టం చేసుకుంటుంటే, మనం కలక్టరేట్‌ల వద్ద రాజకీయ పార్టీలు చేసే ధర్నాలకు, రాస్తారోకోలకు పరిమితమవుతున్నాం. అక్కడ కూడా ముందు వరుసలో కాదు, తలలు లెక్కపెట్టడానికి పనికి వస్తున్నాం. పైగా మన ఏకవాక్య అజండా 'రాజ్యాధికారం!' ఏ అద్భుతమో జరిగి నిజంగానే అది మన దోసిళ్లలోకి వచ్చి పడితే, అది చేజారిపోకుండా పట్టుకోగల్గిన బాహుబలం మనకుందా?

''మట్టిని కాల్చి ఇటుకలు అమ్మే దళితులు మనకెందుకు లేరు? పల్లెలో దొడ్లో నాలుగు తేనెపెట్టెలు పెట్టి తేనె అమ్ముకునే దళితులు మనకెందుకు లేరు? పాలు, పూలు, ఆకుకూరలు సమస్తమూ గ్రామసీమల నుండి వెళ్లకపోతే నగర పౌరుల జీవనాలు స్థంభించిపోవా? వీటి ఉత్పత్తుల్లో మనం ఎందుకు భాగస్వాములు కాలేకపోతున్నాం? మొదటి నుండి కేవలం సేవలకే పరిమితమైపోయిన మనం, యాంత్రిక ప్రత్యామ్నాయాలు వచ్చాక వీధిన పడిపోలేదా? మన సామాజికవర్గాలలో ఇంకా డెబ్బై ఎనభైశాతం మంది ఈ అస్తిత్వపోరులో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతూ

వుండగా, వారి మధ్య విద్యావంతులైన మన ఈ తరం యువత పోషించవలసిన పాత్ర ఏమీలేదా? ఉన్న ఊళ్లో ఉనికి ప్రశ్నార్థకమైతే దానికి అడివి జవాబు ఎలా అవుతుంది? మన మానవ వనరులు అంతా యాంటీ-ఎస్టాబ్లిష్‌మెంట్ దృక్పథం అలవర్చుకుంటూపోతే సవ్య దిశలో యోచించడానికి మనకు మిగిలే సమూహాలేవి?

"అంజయ్యా! నీ పిల్లల సంగతి నాకు తెలియదు గానీ, మన సోకాల్డ్ మిడిల్ క్లాస్ వర్గాల వారసులు, ఇంజనీర్లు- మెడికోలు ఒకపూట వాళ్ల తల్లిదండ్రుల స్వగ్రామలకు వెళ్లగలరా? వెళ్లి వారి రక్త సంబంధీకుల మధ్య కొద్ది సమయం గడపగలరా? గడపాలంటే వాళ్లకీ, వీళ్లకీ మధ్య సంభాషణలకు ఉన్న కామనాల్టీ ఏమిటి? యోగక్షేమాల తర్వాత మాట్లాడ్డానికి వారి మధ్య అడ్డు వచ్చే వేవ్‌లెన్త్ సమస్య ఎంత సున్నితమైంది? నా చిన్నప్పుడు కూడా పల్లెటూళ్ల నుండి వెళ్లి చదివిన ఇంజనీర్లు, డాక్టర్లు ఎంతోమంది ఉన్నారు. కానీ, అప్పట్లో వాళ్ల మూలాలు ఊళ్లలో ఉండేవి. ఇప్పటిలా అవి సమూలంగా పెకలించబడలేదు. పెట్టుబడి గ్రామం నుండి తరలించబడుతుంది. కానీ దాని అంతిమ ఫలితాలు మాత్రం గ్రామాలకు చేరడంలేదు. చేరకపోగా ఈ రెండు సమూహాల మధ్య కృత్రిమంగా చోటు చేసుకుంటున్న అంతరం భవిష్యత్తులో ఒకే సామాజికవర్గం మధ్య కూడా లోతులు కొలవలేనంతగా అగాధాలు సృష్టించబోతోంది. వాటిని పూడ్చడానికి కావాల్సింది సాంకేతిక పరిజ్ఞానం కాదు, సామాజిక పరిణితి. మానసిక విజయాల కంటే, భౌతిక సంపదలు సమకూర్చుకోవడాన్ని మిన్నగా గౌరవించే సమాజం మనది. మనం దానికి మినహాయింపు కావాలి. ముందుగా వెలుగులోకి వెళ్లిన తరాలు, తమ వెనుక చీకటిలో మిగిలినవారి కోసం త్యాగాలు చేయాలి. సామాజిక వైరుధ్యాల నుండి సంభవించే విస్ఫోటనాలను నిలువరించవలసింది, నిర్వీర్యం చేయవలసింది మనలోని బుద్ధి జీవులం మాత్రమే."

*

అంజయ్య మనసు ఇప్పుడు కొంత తేలిక పడింది. కానీ, ఒక్కసారి అతనికి వెన్ను జలదరించింది. పోటీ! పోటీ!! ఈ చదువుల పేరుతో ఇంత అందమైన రంగుల ఇంద్రధనుస్సుల్ని కట్టింది ఎవడు? చదువంటే ఇదేనని నాబోటివాణ్ణి కూడా భ్రమింపజేసిన ఈ కుట్ర ఎవరిది? ఎవరి ప్రయోజనాల కోసం రచించిన వ్యూహమిది?

ఓ వారంరోజులు ఇంటి దగ్గర ఉండి పిల్లలు బయల్దేరారు. అంజయ్య పెద్ద కొడుకు దీపక్ ఛత్తీస్‌గఢ్ బయల్దేరాడు. అంజయ్యకు తన మొదటి పోస్టింగ్ గుర్తుకొచ్చింది. దీపక్ మెళ్లో టై మెరుస్తోంది. తాత మొలగోచీని, మనవడి మెడకు టైగా చుట్టి, ఒక దొడ్లోనే ఇద్దర్నీ పనివాళ్లుగా మార్చిన వైచిత్రి గురించి మాత్రం పైకి మాట్లాడకుండా నిశ్శబ్దంగా తనలోనే దిగమింగుకున్నాడు. అప్పుడు అంజయ్యకు మనసులో అనిపించింది- తన కుటుంబంలో మరొక తరం తన వృత్తిలోనే ఉండి ఉండాల్సిందని.

*ఇండియాటుడే, మార్చి 18, 25 - 2003*

